క్లుప్తంగా

ధ్వజస్తంభానికి ఇత్తడి తాపడం


ధ్వజస్తంభానికి ఇత్తడి తాపడం పనులు

చీపురుపల్లి: శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉన్న ధ్వజస్తంభానికి రూ.4 లక్షలు వ్యయంతో ఇత్తడి తాపడాన్ని మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాలనాయుడు, మాజీ సర్పంచ్ మీసాల సరోజిని దంపతులు బహూకరించారు. సుమారు 300 కేజీలు ఇత్తడితో దీన్ని తయారు చేయించినట్లు చెప్పారు. అమ్మవారి జాతర సందర్భంగా శనివారం ధ్వజస్తంభానికి ఇత్తడి తాపడాన్ని ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు అభినందన


పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీపీ ప్రమీల

గుర్ల: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్, కుస్తీ పోటీల్లో గుర్ల హైస్కూల్ విద్యార్థులు రాణించారు. షూటింగ్ బాల్‌లో ఎస్.దిలీప్, కె.రాము, సాయివంశీ కాంస్య పతకాలను సాధించగా.. కుస్తీ పోటీల్లో ఆర్.తరుణ్, జి.మధు కాంస్య పతకాలు సొంతం చేసుకున్నట్టు పీఈటీ షమీమ్ శనివారం తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఎంపీపీ పొట్నూరు ప్రమీల, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బూర్లె శ్రీనివాసరావు అభినందించారు.

వసతుల పరిశీలన


పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న జడ్జి బి.కనకలక్ష్మి

గజపతినగరం: మండల కేంద్రంలోని బాలసదన్ వసతి గృహాన్ని స్థానిక ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి శనివారం సందర్శించారు. వసతిగృహం పరిసరాలతో పాటు పిల్లలకు కల్పిస్తున్న మౌలిక వసతులు, భోజనాలను పరిశీలించారు. అనంతరం సమీపంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, వసతులు, విద్యాబోధనపై విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట బాలసదన్ సంక్షేమ అధికారి ఆర్.సంధ్య, న్యాయవాదులు పొట్నూరు శ్రీను, పి.ఆదినారాయణ, కె.సాయిశేఖర్, జె.జగదీష్, ఆర్.సాయిసురేష్, శీరపాను తదితరులు ఉన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన


మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ ప్రసాదరావు

గుర్ల: ఇటీవల కాలంలో ఎక్కువ మంది ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ కె.ఆర్.డీ ప్రసాదరావు అన్నారు. మండలంలోని గూడేంలో శనివారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న ఆహారపు అలవాట్లు, మద్యం, పొగాకు వినియోగం తదితర కారణాలతో అనేక మంది క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. అవగాహన, అప్రమత్తతతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యాయామం, యోగా వంటివి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ లెనిన్, రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి రామారావు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, సర్పంచ్ ఎజ్జిపరుపు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులే మూలస్తంభాలు


ఎస్.చింతలవలసలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

• ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

దత్తిరాజేరు: గృహసారథులే పార్టీకి మూలస్తంభాలని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత వారిపై ఉందని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కడుబండి రమేష్‌నాయుడు అధ్యక్షతన శనివారం విజయరాంపురం, షికారుగంజి, రామచంద్రాపురం, చింతలవలస, పాచలవలస, పి.లింగాలవలస, చౌదంతివలస, కె.కృష్ణాపురం, కె.కొత్తవలస, ఎస్.భూర్జవలస, మరడాం, తాడేందొరవలస గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. గృహసారథులతో సమావేశమై చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి


మోడల్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరేళ్లలో చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ ముత్యాలనాయుడు, ఎంపీపీ సంహాద్రిఅప్పలనాయుడు, జడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు అప్పలనాయుడు, రమేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు సుమల శ్రీను, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ డి.త్రినాథరావు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు మండల శ్రీను, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

భోజనం బాగుంటుందా?

దత్తిరాజేరు: షికారుగంజిలో ఉన్న మోడల్ పాఠశాల, ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య శనివారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం బాగుంటుందా? మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. భోజనాలు బాగుంటున్నాయని విద్యార్థులు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ భవనాన్ని మంజూరు చేయాలని సర్పంచ్ సుంకరి వెంకటరావు, మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ధన్నాన త్రినాథరావు ఎమ్మెల్యేను కోరారు.

నేడు గృహసారథులతో సమావేశం

దత్తిరాజేరు: మండలంలోని చినకాద, కన్నాం, గడసాం, ఎం.లింగాలవలస, దాసుపేట, పోరలి, టి.భూర్జవలస, భూపాలరాజపురం గ్రామాల్లో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆదివారం పర్యటించి గృహసారథులతో సమావేశాలు నిర్వహిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు కడుబండి రమేష్‌నాయుడు, సచివాలయ గృహసారథుల మండల కన్వీనర్ మహదేవ్ ఫణీంద్రుడు తెలిపారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లు పరిశీలిస్తున్న జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర ఏర్పాట్లను జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ శనివారం రాత్రి పరిశీలించారు. క్యూలైన్లు, బారికేడ్లు, సాంస్కృతిక కార్యక్రమాల వేదిక తదితర ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు.

జామి: జామి యల్లారమ్మ జాతర ఏర్పాట్లను ఎండోమెంట్ ఏసీ సుధారాణి శనివారం పరిశీలించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం జాతర ఏర్పాట్లపై ఆలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆమె వెంట ఎండోమెంట్ ఈఓ ప్రసాద్‌రావు, సిబ్బంది ఉన్నారు.

జామి జాతరకు ప్రత్యేక బస్సులు

శృంగవరపుకోట: జామి యల్లారమ్మ జాతరకు వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుందని ఎస్.కోట ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. 27న (సోమవారం) జామి–కొత్తవలస, కొత్తవలస–జామిలకు ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. ఉదయం 5.30 గంటల నుంచి రెండు వైపులా బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచుతామన్నారు. జామి నుంచి కొత్తవలసకు రూ.30లు చార్జీ మాత్రమే వసూలు చేయనున్నట్లు చెప్పారు.

పీహెచ్‌సీ సిబ్బంది తీరుపై సభ్యుల ఆగ్రహం


పీహెచ్‌సీ సిబ్బందిని నిలదీస్తున్న సభ్యులు

మెరకముడిదాం: మండల సర్వసభ్య సమావేశానికి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గైర్హాజరుపై సభ్యులు మండిపడ్డారు. ఎంపీడీఓ పి.రామకృష్ణ ఆధ్వర్యంలో ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన శనివారం మండల సమావేశం నిర్వహించారు. ఆరోగ్య శాఖ వివరాలు తెలియజేసేందుకు గర్భాం పీహెచ్‌సీ వైద్యాధికారి మాత్రమే హాజరయ్యారు. మెరకముడిదాం పీహెచ్‌సీ సిబ్బంది రాకపోవడంతో వారికి కబురు పంపారు. రెండు మూడుసార్లు కబురుపెడితే కానీ సమావేశానికి రారా అంటూ సభ్యులు పీహెచ్‌సీ సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను సభ్యులు కోరారు. సమావేశంలో తహసీల్దార్ బి.రత్నకుమార్, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ ఎస్.వి.రమణరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కిశోర బాలికల సంపూర్ణ ఆరోగ్యమే 'సఖి' ఉద్దేశం


జామి: అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి భాగ్యరేఖ


వేపాడ: అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కామేశ్వరి, మహిళా పోలీస్ శ్రీదేవి


గజపతినగరం రూరల్: బాలికలకు అవగాహన కల్పిస్తున్న శ్యామలత


చీపురుపల్లి రూరల్: సఖి కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది


కొత్తవలస: బాలికలకు ఆరోగ్య నియమాలను వివరిస్తున్న డాక్టర్ గోపాలకృష్ణ


బొండపల్లి: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ వేదవతి

మెరకముడిదాం: కిశోర బాలికల సంపూర్ణ ఆరోగ్యమే సఖి గ్రూపుల ముఖ్య ఉద్దేశ్యమని ఐసీడీఎస్ పీఓ రాజేశ్వరి అన్నారు. మండలంలోని సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సఖిగ్రూప్ ఆధ్వర్యంలో విద్యార్థినులతో శనివారం సమావేశం నిర్వహించారు. కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.

- జామి: మండల కేంద్రం జామిలో మాదవరాయి మెట్ట కాలనీ వద్ద సఖి గ్రూపులతో ఎంపీడీఓ సతీష్ శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను, పౌష్టికాహారం ఆవశ్యకతను పీహెచ్‌సీ వైద్యాధికారి భాగ్యరేఖ వివరించారు. అలాగే సోషల్‌మీడియా ట్రాపింగ్, దిశ యాప్ వినియోగంపై బాలికలకు అవగాహన కల్పించారు.
- వేపాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఉజ్వల భవిత, వ్యక్తిగత ఆరోగ్యంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.కామేశ్వరి శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. 9–21 సంవత్సరాల బాలికల విద్య, ఆరోగ్యం, సంరక్షణపై సఖి గ్రూపుల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాలికల సంరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మహిళా పోలీసు శ్రీదేవి వివరించారు. అలాగే బొద్దాం, పాటూరు, సోంపురం గ్రామాల్లో సఖి గ్రూపులకు అవగాహన కల్పించారు.
- గజపతినగరం రూరల్: బాలికల్లో సామాజిక మార్పు, వారిని ఆదర్శవంతమైన పౌరులుగా తీర్చిదిద్దడం, మాతాశిశు మరణాల లేని ఆరోగ్యవంతమైన, విద్యావంతమైన సమాజాన్ని నిర్మించడం సఖి కార్యక్రమం ఉద్దేశమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామలత అన్నారు. మండలంలోని మధుపాడ గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో శనివారం సఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా కిశోర బాలికల్లో విద్య, ఆరోగ్యం, సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నామని, మెరుగైన ఫలితాలు సాధ్యపడుతున్నాయని అన్నారు.
- చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి శివసాయి హైస్కూల్లో శనివారం సఖి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, ఏఎన్‌ఎం పార్వతి, మహిళా పోలీస్ లావణ్య బాలికలు ఎదుర్కొంటున్న వేధింపుల నుంచి వారికి రక్షణ కల్పించడంతో పాటు విద్య, ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు సఖి గ్రూపులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.
- కొత్తవలస: బాల్య వివాహాల వలన ఎన్నో అనర్థాలు కల్గుతాయని వియ్యంపేట అంగన్‌వాడీ ప్రాజెక్టు సీడీపీఓ రొంగలి ఉమాదేవి అన్నారు. వియ్యంపేట సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శనివారం సఖీ గ్రూపులతో సమావేశం నిర్వహించారు. కిశోర బాలికలకు విద్య, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, బాల్య వివాహాలు వలన కలిగే అనర్థాలు, పోక్సో చట్టంలోని అంశాలను సీడీపీఓ వివరించారు.
- బొండపల్లి: గొల్లలపేట గ్రామంలోని అక్షర పాలిటెక్నికల్ కాలేజీలో విద్యార్థులకు సఖి గ్రూపుల ఏర్పాటు, వాటి ఆవశ్యకత, గ్రూపులు నిర్వహించే కార్యక్రమాలను ఎంపీడీఓ ఎ.వేదవతి వివరించారు. కౌమర దశలో ఉన్న బాలికలు తప్పనిసరిగా మంచి ఆహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, చిన్న వయసులో వివాహం చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సఖి గ్రూపులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

లక్ష్య సాధనకు వైకల్యం అడ్డుకాదు


అమృత్‌ను సత్కరిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు వైకల్యం అడ్డుకాదని, వైకల్యాన్ని అధిగమించి ఉన్నతంగా ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. అమెజాన్ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం సాధించిన సూరు అమృత్‌ను శనివారం ఆయన సత్కరించారు. వైకల్యం ఉందని నిరాశ పడకుండా అనుకున్న లక్ష్యాన్ని సాధించిన అమృత్‌ను అభినందించారు. దివ్యాంగత్వం శరీరానికే తప్ప ఆలోచనలకు కాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, మంగళగిరి శ్రీను, ఇప్పిలి తిరుమల, గంట్యాడ విష్ణు, సూరు కామేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలి

చీపురుపల్లి: కనకమహాలక్ష్మి జాతరకు వచ్చే భక్తులు ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలని ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు కోరారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల లేకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తుల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఎక్కడికక్కడ వాహనాల పార్కింగ్ స్థలాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. జాతరలో యువత మహిళలు పట్ల ఎలాంటి ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈవ్‌టీజింగ్, అల్లర్లు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టినట్లు చెప్పారు. పోలీసులకు భక్తులు సహకరించాలని ఎస్సై కోరారు.

సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉండండి

బొండపల్లి: జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేయాలని, ఉగాది నాటికి సామూహిక గృహప్రవేశాలకు సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ వేదవతి సూచించారు. రాచకిండాం గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంట్, ఐరన్ అందించడంతో పాటు బిల్లులు సకాలంలో చెల్లించడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈఓపీఆర్డీ సీహెచ్.సుగుణకరరావు, హౌసింగ్ ఏఈఈ రమణరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

వేపాడ: మండల కేంద్రంలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ బీఎస్ఎన్ పట్నాయక్ శనివారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉగాదికి ప్రభుత్వం సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించాలని నిర్ణయించిందని, అప్పటికల్లా నిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. ఐకేపీ ఏపీఓ శ్రీనివాసరావు, ఏఈ అలీ, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ ఉన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

లక్కవరపుకోట: నవధాన్యాల సాగుతో నేల సారవంతం అవుతుందని, పంట దిగుబడి పెరుగుతుందని సబల స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ కె.ఈశ్వరరావు అన్నారు. మండలంలోని లింగంపేట గ్రామంలో నవధాన్యాల సాగుపై శనివారం రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. దీని వల్ల సాగు ఖర్చు తగ్గుతుందన్నారు.

- దత్తిరాజేరు: మండలంలోని గుచ్చిమిలో నవధాన్యాలు సాగుపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించారు. పొదుపు సంఘాల మహిళలకు గ్రామ సమాఖ్య ద్వారా నవధాన్యాల విత్తనాలు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం వలన భూసారం పెరుగుతుందన్నారు. నవధాన్యాల సాగుతో రైతుల తిండి గింజలకు ఇబ్బందులు ఉండవన్నారు.

మెరుగైన సేవలందించాలి


చిన్నారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ

చీపురుపల్లి రూరల్: మండలంలోని కర్లాం గ్రామాన్ని ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి శనివారం సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి చిన్నారుల హాజరు రిజిస్టర్, ఎత్తు, బరువు రికార్డులు పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యంపై దృష్టిసారించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. సేవలు మరింత మెరుగుపరచాలని ఆదేశించారు.

పశువులకు సకాలంలో వ్యాక్సినేషన్

వేపాడ: పశువులకు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయడంతో పాటు ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు చలపతిరావు సూచించారు. వేపాడ పశువైద్య కేంద్రంలో వీఏఏలు, గోపాలమిత్రలతో శనివారం సమావేశం నిర్వహించారు. పాడిరైతులకు మెరుగైన సేవలందించాలన్నారు. పశుసంవర్ధకశాఖ ద్వారా అందిస్తున్న పథకాలు, రాయితీలను రైతులకు వివరించాలని సూచించారు. ప్రతీ రైతు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.

పెట్రోల్ బంక్ తనిఖీ

శృంగవరపుకోట: కాపుసోంపురం వద్ద ఉన్న ఎస్.ఆర్ పెట్రోల్ బంక్‌లో సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌వీవీఎస్ మూర్తి శనివారం తనిఖీ చేశారు. పెట్రోల్ నాణ్యత, డెన్సిటీలను తనిఖీ చేయడంతో పాటు బంకులో వినియోగదారులకు కనీస వసతులు కల్పించారో లేదో పరిశీలించారు. నిబంధనలు పాటించని బంకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

స్పెషల్ వాక్సినేషన్ డ్రైవ్

శృంగవరపుకోట: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది శనివారం చిన్నారుల కోసం ప్రత్యేక వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహించారు. తలారి గ్రామంలో చేపట్టిన వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను డీఎంహెచ్‌ఓ ఎస్.వి.రమణకుమారి పర్యవేక్షించారు. వ్యాక్సినేషన్ లక్ష్యాలను చేరుకోవాలని సిబ్బందికి సూచించారు.

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలకు రేపటితో గడువు పూర్తి

గజపతినగరం: ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయకుమారి తెలిపారు. పదో తరగతి పాసై చదువు మధ్యలో ఆపేసిన వారు ఈ నెల 27వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫీజు చెల్లించిన వారికి ఏప్రిల్‌లో పరీక్షలు ఉంటాయని, అంతకుముందు 15 రోజుల పాటు ఓరియంటేషన్ తరగతులు నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా షిర్డీసాయి మందిర వార్షికోత్సవం

లక్కవరపుకోట: మండలంలోని గోల్డుస్టార్ జంక్షన్ సమీపంలో ఉన్న షిర్డీసాయి మందిరం 19వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. బాబాకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం


నృత్య ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థినులు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీసత్యరామ డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో ఈ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ ఎ.జగదీష్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. లక్ష్యం లేని ప్రయాణం వ్యర్థమన్నారు. సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికతో చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.